సాక్షి
శ్రీకాకుళం
శనివారం । 12 । ఆగస్టు । 2023



ఓటరు సర్వే పూర్తి కావాలి

18వ తేదీకి ఓటరు సర్వే పూర్తి కావాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన సమీక్షించారు.

- 10లో



తెలుగుకు వన్నె అవధానం

శ్రీకాకుళంలో సంపూర్ణ శతావధానం నిర్వహించారు. ఆద్యంతం రక్తి కట్టింది.

- 10లో

టెక్కలి ఇన్‌చార్జి ఆర్డీఓగా సీతారామ్మూర్తి

టెక్కలి: టెక్కలి ఇన్‌చార్జి ఆర్డీఓగా టి.సీతారామ్మూర్తికి ఎఫ్‌ఏసీ బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ సబ్ కలెక్టర్‌గా పనిచేసిన టి.రాహుల్‌కుమార్ రెడ్డి ఇటీవల నంద్యాల జేసీగా పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పలాస ఆర్డీఓ సీతారామ్మూర్తికి ఇన్‌చార్జి ఆర్డీఓగా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

న్యూస్‌రీల్

14న అప్రెంటిస్‌షిప్ మేళా

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఐటీఐ)లో ఈ నెల 14న ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ లండ సుధాకర్ రావు చెప్పారు. ఐటీఐలో శక్రవారం వివరాలు వెల్లడించారు. ఉదయం 9 గంటల నుంచి ఈ మేళా ప్రారంభమవుతుందని అన్నారు. హాజరయ్యే అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాల రెండు సెట్ల జిరాక్సులతో రావాలన్నారు. బయోడేటా ఫారం, విద్యార్హత ధ్రువీకరణ పత్రం, పదో తరగతి ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు జిరాక్సులు ఉండాలని, రెండు కలర్ ఫొటోలు అవసరమని తెలిపారు. అరబిందో ఫార్మా, రెడ్డీస్ ల్యాబ్, నాగార్జునా అగ్రికెం, స్మార్ట్ కెం, ఉషోదయ పబ్లికేషన్స్ వంటి 12 కంపెనీలు హాజరవుతాయని పేర్కొన్నారు. రెండేళ్ల ఐటీఐ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. పూర్తి వివరాలకు విద్యార్థులు ఫోన్ నంబర్లు 9666841306, 9441944549లను సంప్రదించాలని చెప్పారు.

విదేశీ విహంగానికి రక్షణ



విదేశీ విహంగాన్ని కాపాడుతున్న ఆర్టీసీ సిబ్బంది

కాశీబుగ్గ: రెక్కలకు దెబ్బలు తగిలి పలాస ఆర్టీసీ డిపో ఆవరణలో పడిపోయిన విదేశీ విహంగానికి సెక్యూరిటీ సిబ్బంది రక్షణ కల్పించారు. విధుల్లో ఉన్న గురుగుబెల్లి రామమోహనరావు పక్షికి అవసరమైన నీటిని, ఆహారాన్ని అందించారు. అనంతరం ఫారెస్టు అధికారులకు, తేలినీలాపురం పక్షుల కేంద్రం బాధ్యులకు సమాచారం అందించారు. విద్యుత్ తీగల వల్ల పక్షి కుడిరెక్క దెబ్బతిని ఉంటుందని, స్థానిక వైద్యులతో చికిత్స చేయిస్తామని తెలిపారు. ఆయనతో పాటు ఆర్టీసీ గ్యారేజిలో ఉన్న సిబ్బంది, డ్రైవర్‌లు, కండక్టర్లు సపర్యలు చేశారు.

అనుమతి లేకుండా పాఠశాల నిర్వహణ


శ్రీకాకుళం: శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డు సమీపంలో ఉన్న నారాయణ పాఠశాలను అనుమతి లేకుండా నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చైల్డ్ రైట్ ప్రొటెక్షన్ కమిషన్ చైర్మన్ కె.అప్పారావు తెలిపారు. కోచింగ్ సెంటర్ పేరిట అనుమతులు తీసుకుని పాఠశాల నిర్వహిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. ఇక్కడ ఒక విద్యార్థికి టీసీ ఇవ్వడానికి యాజమాన్యం ఒప్పుకోకపోవడంతో ఆ విద్యార్థి తరపు వారు బాలల హక్కుల పరిరక్షణ కమిటీని ఆశ్రయించారు. కమిటీ చెప్పాక కూడా ఆ విద్యార్థికి టీసీ ఇవ్వలేదు. దీంతో కమిషన్ సభ్యులు శుక్రవారం ఆకస్మికంగా నారాయణ స్కూల్‌ను తనిఖీ చేయగా టీసీలతో పాటు ఫీజుల విషయంలోనూ వేధిస్తున్నట్లు తెలిసింది. మౌలిక వసతులు కూడా లేవనే అంశాన్ని కూడా గుర్తించినట్లు దీనిపై ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని ఆయన తెలిపారు. ఆయనతో పాటు మెంబర్ గొండు సీతారాం ఉన్నారు.

బీచ్‌లు అభివృద్ధి చేయాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: తీర ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నూతనంగా గుర్తించిన 67 బీచ్‌లు, కోస్టల్ జోన్ మేనేజ్ మెంట్ అథారిటీ ప్లాన్‌పై శుక్రవారం జిల్లా పర్యాటక మండలి సభ్యులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంపికైన బీచ్‌ల మ్యాప్‌లను రూపొందించే ముందు సీఆర్‌జెడ్ ప్రాంతాన్ని పక్కాగా గుర్తించాలన్నారు. సముద్ర ప్రాంతానికి ఒక కిలోమీటర్ దూరంగా ఉన్న ప్రభుత్వ భూముల్లో టూరిజం అభివృద్ధికి చేపట్టనున్న ప్రాజెక్టుపై విశదీకరించాలని అధికారులను కోరారు.

జూనియర్ అసిస్టెంట్ మెరిట్ జాబితా విడుదల

శ్రీకాకుళం పాతబస్టాండ్: జూనియర్ అసిస్టెంట్ కం కంప్యూటర్ అసిస్టెంట్ పోస్టు మెరిట్ జాబితాను విడుదల చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి పి మురళీకృష్ణ తెలిపారు. వీరికి ప్రొఫిషియన్సీ పరీక్ష ఉంటుందని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థుల జాబితా కలెక్టరేట్‌లో, మండల తహసీల్దారు కార్యాలయం నోటీస్ బోర్డులో, శ్రీకాకుళం జిల్లా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని, 1:2 నిష్పత్తిలో జాబితా ఉంటుందని తెలిపారు.



మూలపేట పోర్టు నిర్మాణంలో భాగంగా సముద్రం లోపలకు జరుగుతున్న బ్రేక్ వాటర్ పనులు(స్టోన్ ఫిల్లింగ్)

పోర్టు పనులు శరవేగంగా..

- రెండు నెలల్లోనే 350 మీటర్ల వరకు సౌత్ బ్రేక్ వాటర్ పనులు
- సెప్టెంబర్ నెలలో ఆరంభం కానున్న నార్త్ బ్రేక్ వాటర్ వర్క్
- బెర్తుల నిర్మాణానికి చకచకా ఏర్పాట్లు
- ప్రాథమిక పనుల్లో స్థానికులకే ఉపాధి కల్పిస్తున్న యాజమాన్యం



పోర్టు నిర్మాణంలో భాగంగా సముద్రం లోపలకు వేస్తున్న రోడ్డు



టెక్కలి: సిక్కోలు తీరానికి మణిహారంగా నిలవనున్న మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసిన కొద్ది రోజులకే పోర్టు పనులు ఆరంభించారు. ఇందులో భాగంగా ఇప్పటికే బ్రేక్ వాటర్ పనులు, ఫైలింగ్ ప్రాజెక్టు విస్తరణ పనులు, బెర్తుల నిర్మాణానికి మట్టి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మరో వైపు నిర్వాసితులకు అందాల్సిన పరిహారాలను విడతల వారీగా అందజేస్తున్నారు. వీటితో పాటు పోర్టు నిర్మాణంలో ప్రాథమికంగా అవసరమైన సిబ్బందిని స్థానికుల నుంచే తీసుకుంటున్నారు.

సౌత్ బ్రేక్ వాటర్ పనులు

పోర్టు నిర్మాణంలో కీలకమైన బ్రేక్ వాటర్ పనులకు సంబంధించి(స్టోన్ ఫిల్లింగ్) విశ్వ సముద్ర సంస్థ యాజమాన్యం ఆధ్వర్యంలో ఇప్పటికే సముద్రంలోకి 350 మీటర్ల మేరకు సౌత్ బ్రేక్ వాటర్ పనులు చేపట్టారు. మొత్తం 2.4 కిలోమీటర్ల మేరకు ఈ పనులు చేపట్టాల్సి ఉంది. మరో రెండు నెలల్లో ఈ పనులు పూర్తి చేయనున్నారు. అలాగే సెప్టెంబర్ నెల నుంచి నార్త్ బ్రేక్ వాటర్ పనులను ప్రారంభించనున్నారు. ఇది మొత్తం 580 మీటర్ల వరకు చేపడతారు. వీటితో పాటు బెర్తుల నిర్మాణానికి అవసరమైన మట్టి పనులను చేపడుతున్నారు. అంతే కాకుండా ఫైలింగ్ పనులతో పాటు ప్రాజెక్టు విస్తరణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

దశల వారీగా పరిహారం

మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు పనులతో పాటు మరో వైపు నిర్వాసితులకు వివిధ రకాల పరిహారాన్ని అందజేస్తున్నారు. ఇందులో భాగంగా ఇటీవల జీడి చెట్ల పరిహారాన్ని అందజేశారు. మొత్తం 2500 జీడి చెట్లుకు సంబంధించి ఇప్పటికే మొదటి విడతగా 358 జీడి చెట్లకు సంబంధించి మొదటి విడతగా ఇటీవల రూ.9 లక్షల పరిహారాన్ని అందజేశారు. రెండో విడతగా మరో వారం రోజుల్లో పరిహారాన్ని అందజేసేందుకు ఏర్పాట్లు చేశారు. వీటితో పాటు 3వ విడతగా ఆయా రైతుల సమక్షంలో జీడి చెట్లను లెక్కించే ప్రక్రియ ప్రారంభించనున్నారు. లెక్కింపు పూర్తయిన తర్వాత పరిహారాన్ని అందజేస్తారు. అంతే కాకుండా మూలపేట, విష్ణుచక్రంతో పాటు మరి కొన్ని గ్రామాలకు వెళ్లే మార్గాన్ని పటిష్టం చేస్తున్నారు. కల్వర్టులు ఉన్న చోట వంతెనల నిర్మాణం చేపడుతున్నారు.

స్థానికులకే ప్రాధాన్యత

పోర్టు నిర్మాణంలో భాగంగా ప్రాథమిక పనుల్లో స్థానికులకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇప్పటికే చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన సుమారు 30 మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 100 మందికి ఉపాధి కల్పించారు. భవిష్యత్‌లో అవసరమైన మేరకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు.

ప్రత్యేక శ్రద్ధతో..

మూలపేట పోర్టు నిర్మాణం విషయంలో ప్రత్యేక శ్రద్ధతో పనులు చేపడుతున్నాం. పోర్టు నిర్మాణానికి స్థానికంగా అవసరమైన అన్ని రకాల అనుమతులతో పనులు వేగవంతం చేస్తున్నాం. బ్రేక్ వాటర్ పనులకు అవసరమైన స్టోన్స్‌తో పాటు గ్రావెల్‌కు సంబంధించి ప్రభుత్వానికి కట్టాల్సిన ఫీజును చెల్లించి తవ్వకాలు చేస్తున్నాం. అంతే కాకుండా ఉపాధి అవకాశాల విషయంలో స్థానికులకే ప్రాధాన్యత కల్పిస్తున్నాం. గ్రామస్తులకు అవసరమైన రోడ్డు మార్గాన్ని సైతం మరింత పటిష్టం చేస్తున్నాం.

– ఎం.శంకర్, జీఎం, విశ్వ సముద్ర నిర్మాణ సంస్థ

టూ టౌన్.. వెరీ మోడ్రన్



బయట వరండా (పార్కింగ్ స్పేస్) లో ఫ్లోరింగ్ చేస్తున్న సిబ్బంది

- సర్వాంగ సుందరంగా శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్
- క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా విజిట్ ఉండటంతో ఆధునికీకరణకు ఎస్పీ ఉత్తర్వులు
- టైల్స్, ఫ్లోరింగ్, పెయింటింగ్‌లతో అందంగా ముస్తాబు

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ ముప్పై ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత రూపురేఖలు మార్చుకుంది. ఎస్పీ జీఆర్ రాధిక ఆదేశాల మేరకు టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌ను మోడ్రన్‌గా తీర్చిదిద్దారు. మోడ్రన్ పోలీస్ స్టేషన్ల జాబితాలో దీనితో పాటు గార, వన్‌టౌన్ పీఎస్‌లు ఉన్నాయి. 1993 ఫిబ్రవరి 11న అప్పటి ఎస్పీ పి.కృష్ణంరాజు (ఐపీఎస్), ఏఎస్పీ సయ్యద్ మీర్ మొహ్మద్, డీఎస్పీ ఎం.రామారావు, ఇన్‌స్పెక్టర్ ఎస్.బాబూరావుల సమక్షంలో ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ నిధులతో ఈ పోలీస్‌స్టేషన్ నిర్మాణం ప్రారంభించారు. అప్పట్లో మంత్రిగా ఉన్న ధర్మాన ప్రసాదరావు 1993 అక్టోబర్ 20న పోలీస్ స్టేషన్ భవనాన్ని లాంఛనంగా ప్రారంభించారు.

30 ఏళ్ల తర్వాత..

దాదాపు 30 ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు భవనాన్ని రీమోడలింగ్‌లో భాగంగా సీఐ పప్పల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్ఐలు నాగిరెడ్డి లక్ష్మణరావు, కె.లక్ష్మిలు హెచ్‌సీ సింహాచలం, పీసీ జి.రవిశంకర్, మరి కొంతమంది సిబ్బంది సహకారంతో తీర్చిదిద్దారు. క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఈ మధ్యన తనిఖీకి రానుండటంతో స్టేషన్‌లో రిసెప్షన్, విజిటర్స్ వెయిటింగ్, రికార్డుల మెయింటెనెన్సు, స్టోర్ రూమ్, ఎస్ఐ–1, ఎస్ఐ–2లకు విడివిడిగా గదులు, సీఐ రూమ్‌లకు టైల్స్ వేయడంతో పాటు, కలర్ పెయింటింగ్ పుట్టీలు, ఫర్నీచర్, బయట వరండాలో (పార్కింగ్ స్పేస్) ఫ్లోరింగ్, రేకుల షెడ్డు, బాత్రూమ్‌ల్లో టైల్స్, బయట కాంపౌండింగ్ వాల్‌కు పెయింటింగ్‌లు వేయించారు. చుట్టూ పేరుకుపోయిన పిచ్చిమొక్కలను తొలగించి పచ్చని మొక్కలను నాటారు. సీజ్ అయిన వాహనాలను స్టేషన్‌కు దూరంగా ఉంచారు.

టెక్నాలజీలోనూ..

నగరంలో ఆరు పీటీజెడ్ కెమెరాలు, మూడు బుల్లెట్ సీసీ కెమెరాలను స్టేషన్ నుంచే మానిటర్ చేస్తారు. ఇక ఇది నేరుగా విజయవాడ (అమరావతి) డీజీపీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌నకు సమాచారం చేరవేస్తుంది. స్టేషన్‌లోనూ ఐదు సీసీ కెమెరాలు ఉన్నాయి.

ఎస్పీ ఉత్తర్వులతోనే..



మా ఎస్పీ ఉత్తర్వులతోనే స్టేషన్‌ను బాగుచేయించాం. మోడరన్ పీఎస్ లిస్ట్‌లో ఉండటంతో క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనలకు లోబడి అంతా సిద్ధం చేశాం. స్టేషన్‌లోని ఎస్ఐలు, సిబ్బంది చక్కని సహకారంతోనే ఇది సాధ్యమైంది.

– పప్పల శ్రీనివాసరావు, సీఐ, టూటౌన్ పీఎస్



డీజీపీ కార్యాలయానికి సీసీ ఫుటేజీ అనుసంధానం



నేడు సర్వాంగ సుందరంగా టూటౌన్ పీఎస్

జనసేన, టీడీపీలకు కాలం చెల్లింది

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ఏమీ చేయలేరు : మంత్రి బొత్స
- జగన్ జవాబుదారీతనం తెచ్చారు: స్పీకర్ తమ్మినేని
- ప్రజలను మభ్యపెట్టేందుకే బాబు, పవన్ తిరుగుతున్నారు : మంత్రి సీదిరి
- ఘనంగా ఎచ్చెర్ల గడపగడపకూ మన ప్రభుత్వం విజయోత్సవ సభ



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

రణస్థలం: వచ్చే కొత్త అమావాస్య తర్వాత టీడీపీ, జనసేన పార్టీలు ఉండవని జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ సారథ్యంలో శుక్రవారం శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలో గడపగడపకూ మన ప్రభుత్వం విజయోత్సవ సభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మంత్రి బొత్స మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌కు ప్రజల్లో అభిమానం ఉందని, ఆయనను ప్రతిపక్షాలు ఏమీ చేయలేవని అన్నారు. 'ప్రజల నాడి తెలిసిన వ్యక్తిగా నాకు ఉన్న అనుభవంతో చెబుతున్నా.. జగన్‌ను ఆడిపోసుకుంటే వారికే నష్టం' అని అన్నారు. నిలకడ లేని పవన్ కల్యాణ్ గురించి రాజకీయాల్లో మాట్లాడాల్సి వస్తోందన్నారు. చంద్రబాబుకు ఓట్లు, ఎన్నికలు తప్ప ఇంకేం పట్టదని విమర్శించారు. గడపగడపకూ కార్యక్రమంతో నాయకులకు, కార్యకర్తలకు ధైర్యం వచ్చిందని, ఉత్తరాంధ్రలో గడపగడపకూ.. పూర్తి చేసినందుకు ఎమ్మెల్యే కిరణ్‌ను అభినందిస్తున్నానని తెలిపారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో తనతో నడిచిన అధికారులు, నాయకులకు ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో ఎచ్చెర్ల నియోజకవర్గ పరిశీలకులు నెక్కల నాయుడుబాబు, మాజీ పరిశీలకులు అంధవరపు సూరిబాబు తదితరులు ఉన్నారు.

తేడా చూసుకోండి



గత ప్రభుత్వానికి వైఎస్ జగన్ ప్రభుత్వానికి తేడా ప్రజలు గమనించాలి. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహించాం. ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టేందుకే చంద్రబాబు, పవన్‌లు తిరుగుతున్నారు. ఒకప్పుడు జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకుంటేనే పథకాలు వచ్చేవి, ఆ అరాచకాలకు చరమ గీతం పాడేందుకే సీఎం వైఎస్ జగన్ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చారు. మొక్కవోని దీక్షతో ఎమ్మెల్యే కిరణ్ గడపగడపకూ.. పూర్తి చేయడం అభినందనీయం.

– సీదిరి అప్పలరాజు, మంత్రి

వైఎస్ జగన్‌ది పారదర్శక పాలన



సీఎం వైఎస్ జగన్‌ది పారదర్శక పాలన. ఎవరి ప్రమేయం లేకుండా పథకాలు జనాలకు అందిస్తున్నారు. గ్రామాల్లో సచివాలయాలు వచ్చిన తర్వాత రూపురేఖలు మారిపోయాయి. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి తాగునీటి సదుపాయం కల్పిస్తున్నాం. ఎన్నికల వరకే రాజకీయాలు. తర్వాత అర్హులైతే సంక్షేమ పథకాలు ఇస్తాం.

– బెల్లాన చంద్రశేఖర్, విజయనగరం ఎంపీ

ప్రజాస్వామ్యానికి సరికొత్త భాష్యం



చెప్పిన తేదీకే సంక్షేమాలు అమలు చేస్తూ సీఎం వైఎస్ జగన్ ప్రజా స్వామ్యానికి సరికొత్త భాష్యం చెప్పారు. ఓటు వేసిన ప్రజలకు ప్రభుత్వం జవాబుదారీలా ఉండేలా చూశారు. గతంలో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగితే గానీ జరగని పనులు ఇప్పుడు చాలా సులువుగా జరుగుతున్నాయి. సీఎం వైఎస్ జగన్ బటన్ నొక్కి సంక్షేమం అందిస్తే..జనం ఫ్యాన్ గుర్తుపై నొక్కి అభిమానం చూపాలి. చంద్రబాబు ఏం పొడిచారని ప్రాజెక్టులు చూసేందుకు వచ్చారు. బస్సుపై నుంచి మాట్లాడి వెళ్లడం కాదు, ప్రజల సమస్యలు తెలుసుకోవాలంటే ప్రజల్లోకి వెళ్లి మాట్లాడాలి.

– తమ్మినేని సీతారాం, స్పీకర్

ప్రజలకు అండగా ఉండే వ్యక్తి జగన్



వైఎస్సార్ మృతిని తట్టుకోలేక చనిపోయిన 650 కుటుంబాలకు వైఎస్ జగన్ అండగా నిలబడ్డారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగన్ మళ్లీ అధికారంలోకి వస్తారు.

– ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

ఉద్యోగం పేరిట రూ.6 లక్షలకు టోపీ



ఇలపండ వేణుగోపాలరావు (ఫైల్)

గార: మాయమాటలు చెప్పడం.. డబ్బులు గుంజుకోవడం.. ఆ డబ్బుతో జల్సాలు చేయడం అలవాటుగా మార్చుకున్న వ్యక్తిపై గార పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. పోలాకి మండలం ఇలపండపేటకు చెందిన ఇలపండ వేణుగోపాలరావు తనకు విజయవాడలో ఉన్నతాధికారులతో మంచి పరిచయం ఉందని, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగా లు ఇప్పిస్తానంటూ పలువురి వద్ద డబ్బులు వసూ లు చేశాడు. ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో వారు డబ్బులు అడిగితే ప్రజా ప్రతినిధులు తనకు బంధువులంటూ బెదిరిస్తున్నాడు. గార ఇసుక ర్యాంపులో పనిచేస్తున్న వంజంగి లోకనాథం ఇలాగే మోసపోయాడు. లోకనాథంకు తన బావ ద్వారా వేణుగోపాలరావు పరిచయమయ్యాడు. హోంగార్డు పోస్టులున్నాయని చెప్పడంతో ఆయన మాటలు నమ్మిన లోకనాథం రూ.6 లక్షలు ఇచ్చాడు. ఇప్పటికే ఆరుమాసాలైనా ఉద్యోగం లేకపోవడంతో వేణును నిల దీశాడు. అయితే ప్రజాప్రతినిధులు తన బంధువులని, ఎక్కువగా మాట్లాడితే ఇబ్బంది పడతావని వేణు తిరిగి బెదిరింపులకు దిగాడు. దీంతో లోకనాథం శుక్రవారం గార పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ ఎస్.కామేశ్వరరావు దర్యాప్తు ప్రారంభించాడు. వేణుగోపాలరావుపై గతంలో కూడా శ్రీకాకుళం టూటౌన్, వన్‌టౌన్, సంతబొమ్మాళి, హిరమండలం, సరుబుజ్జిలి లో కేసులు ఉన్నట్లు గుర్తించారు.

పాలీసెట్ ఆప్షన్ల ఎంపిక ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ పాలీసెట్–2023 పాలిటెక్నిక్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన ఆప్షన్ల ఎంపిక శుక్రవారం ప్రారంభమైంది. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సహాయ కేంద్రం నిర్వహిస్తున్నారు. ఈ నెల 14 వరకు ఆప్షన్ల ఎంపిక కొనసాగనుంది. గతంలో పాలీసెట్‌లో ర్యాంకు వచ్చి ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరు కాని విద్యార్థులు ఆసక్తి ఉంటే ఇప్పుడు హాజరు కావచ్చు. సహాయ కేంద్రానికి ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు శుక్రవారం 11 మంది హాజరయ్యారు. మే 29 నుంచి జూన్ ఐదు వరకు జరిగిన ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు 2647 మంది హాజరయ్యారు. జిల్లా నుంచి పాలీసెట్‌కు 11,198 మంది పరీక్ష రాయగా, 9705 అర్హత సాధించారు. జిల్లాలో ఐదు ప్రభు త్వ, ఐదు ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. విద్యార్థులు ర్యాంకు బట్టి రాష్ట్రం యూనిట్‌గా ఎక్కడైనా చేరవచ్చు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 300, శ్రీకాకుళం మహి ళా ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 120, ఆమదాలవలస ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 120, టెక్కలి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 120, సీతంపేట మోడల్ పాలిటెక్నిక్‌లో 120, ప్రైవేట్ కళాశాలల్లో ఎచ్చెర్ల వెంకటేశ్వర పాలిటెక్నిక్‌లో 462, చిలకపాలేంలోని శ్రీ శివానీ పాలిటెక్నిక్‌లో 263, టెక్కలి ఐతం పాలిటెక్నిక్‌లో 396, మందస టీవీఆర్ పాలిటెక్నిక్‌లో 297, గూడేం నారాయణ పాలిటెక్నిక్‌లో 298 సీట్లు ఉన్నాయి.



నమూనా చెక్కు అందిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ తదితరులు

అతివలకే అగ్రతాంబూలం

- వైఎస్సార్ సున్నావడ్డీతో ఆర్థిక చేయూత
- జిల్లాలో 51,743 సంఘాలకు రూ. 69.06 కోట్లు జమ

శ్రీకాకుళం పాతబస్టాండ్: వైఎస్సార్ సున్నావడ్డీతో మహిళలకు ఆర్థిక చేయూత లభిస్తుందని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అమలాపురం పట్టణంలో వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని వర్చువల్ విధానంలో శుక్రవారం ఆయన ప్రారంభించారు. శ్రీకాకుళంలోని కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అంతా సీఎం ప్రసంగాన్ని విన్నారు. కార్యక్రమానికి కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ముఖ్యఅతిథిగా హాజరు కాగా.. ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, నరసన్నపేట శాసన సభ్యులు ధర్మాన కృష్ణదాస్, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, పొందర కూరాకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ హైమావతి కూడా పాల్గొన్నారు. తొలుత జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, పథక సంచాలకులు డాక్టర్ విద్యాసాగర్ ప్రగతి నివేదిక వినిపించారు. కలెక్టర్ మాట్లాడుతూ 26 జిల్లాల్లో అత్యధికంగా సున్నా వడ్డీ శ్రీకాకుళం జిల్లాకు అందుతుందని అన్నారు. ప్రభుత్వం మహిళపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అన్ని పథకాలు అతివలకే అందజేస్తున్నట్లు వివరించారు. జిల్లాలో మొత్తం 51,743 సంఘాలకు గాను రూ. 69.06 కోట్లు వారి వారి ఖాతాల్లో జమ చేస్తున్నట్లు చెప్పారు. మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు ఈ రోజు సున్నా వడ్డీ కార్యక్రమం ఒక పండగలా చేసుకోవడం శుభపరిణామమన్నారు. రాష్ట్రంలో మహిళలకే 32 లక్షలకు పైగా ఇళ్ల పట్టాలు అందజేసినట్లు తెలిపారు. ఇచ్చిన అన్ని హా మీలూ అమలు చేశామని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేశారు.

క్లుప్తంగా

ఎత్తుకు పై ఎత్తు



పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ ఓ.గిరీష్, పక్కనే రాష్ట్ర, జిల్లా చెస్ సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: సిక్కోలు వేదికగా ఏపీ రాష్ట్రస్థాయి అండర్-11 బాలబాలికల చెస్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఏపీ రాష్ట్ర చెస్ అసోసియేషన్, సీఎస్ఎన్ ట్రస్ట్ సౌజన్యంతో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఇందిరా విజ్ఞాన్ మందిరం వేదికగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు రెండోరోజు కీలక దశకు చేరుకున్నాయి. వివిధ జిల్లాల క్రీడాకారులు నువ్వా-నేనా అన్నట్టుగా తలపడుతున్నారు. మొత్తం ఎనిమిది రౌండ్ల పాటు జరుగుతున్న ఈ పోటీల్లో శుక్రవారం సాయంత్రంతో ఆరు రౌండ్ల వరకు పోరు ముగిసింది. బాలుర విభాగంలో అనంతపురం, తిరుపతి, విశాఖపట్నం జిల్లాల క్రీడాకారులు ముందంజలో ఉన్నారు. బాలికల విభాగంలో ప్రకాశం, కృష్ణ, తిరుపతి జిల్లాల క్రీడాకారులు టాప్‌గేర్‌లో దూసుకెళ్తున్నారు. రెండో రోజు పోటీలను జీఎంఆర్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ ఓ.గిరీష్ పోటీలను ప్రారంభించారు.

18 నాటికి ఓటరు సర్వే పూర్తి కావాలి



టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్



శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లావ్యాప్తంగా ప్రత్యేకంగా ఓటర్ల నమోదుపై జరుగుతున్న ఇంటింటి సర్వే ఈ నెల 18నాటికి వంద శాతం పూర్తికావాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం తన చాంబర్‌లో మున్సిపల్ కమిషనర్లు, ఈఆర్‌ఓ, ఏఈఆర్‌ఓలు, బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత నెల 21న ప్రారంభమైన ఇంటింటి సర్వే ఈ నెల 21తో ముగియనున్నట్లు చెప్పారు. అయితే ఇప్పటి వరకు యాప్ పరంగా 32 శాతం మాత్రమే సర్వే పూర్తయ్యిందని, మిగిలిన జిల్లాలు దాదాపు 80 శాతం వరకు పూర్తి చేశాయని కలెక్టర్ గుర్తుచేశారు. యాప్‌లో కొన్ని సాంకేతిక సమస్యలు ఉన్నట్లు గుర్తించినప్పటికీ పలు జిల్లాలు చివరి దశకు చేరువలో ఉన్నాయని పేర్కొన్నారు. వేకువజామున, సాయంత్రం వేళల్లో యాప్ బాగా పనిచేస్తున్నందున, ఆ సమయాల్లో బీఎల్‌ఓలు పనిచేసి లక్ష్యాలను సాధించాలని తెలిపారు. ఇది కొంత కష్టతరమైనప్పటికీ అనుకున్న లక్ష్యసాధన కోసం అందరూ కష్టపడి పని చేయాలని కలెక్టర్ కోరారు. సర్వే పరంగా చూస్తే టెక్కలి నియోజక వర్గం అన్నిటికంటే వెనుకంజలో ఉందని, అక్కడ 57శాతం మాత్రమే సర్వే ఫిజికల్‌గా జరిగిందని అన్నారు. సారవకోట 34 శాతం, కోటబొమ్మాళి, సంతబొమ్మాళిలో 53.4 శాతం మాత్రమే పూర్తిచేశారన్నారు. సరిగా పనిచేయని బీఎల్‌ఓల వల్ల జిల్లాకు చెడ్డ పేరు వస్తుందని, పనిచేయని అధికారులను సస్పెండ్ చేసేందుకు కూడా వెనుకాడబోమని కలెక్టర్ హెచ్చరించారు. శని, ఆది వారాలు, స్వాతంత్ర్య దినోత్సవం, రానున్న ఆదివారం ప్రభుత్వ సెలవు రోజు లు అయినప్పటికీ ప్రతి బీఎల్‌ఓ సిబ్బందితో కలిసి పనిచేసి లక్ష్యాలు సాధించాలన్నారు. గారలో 13 శాతం మా త్రమే సర్వే పూర్తయినట్లు ఆన్‌లైన్‌లో కనిపిస్తోందని, పనితీరు మార్చుకోకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శతశాతం పరిశీలన అనంతరం ఈ నెల 28న బీఎల్‌ఓలు రిపోర్టులు సమర్పించాలన్నారు. 29న ఏఈఆర్‌ఓలు, 30న ఈఆర్‌ఓలు రిపోర్టులు డీఈఓకు సమర్పించాల్సి ఉందని కలెక్టర్ తేల్చిచెప్పారు. తొలగింపులపై ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తప్ప క పాటించాలని, జాబితాలు రూపొందించడంలో పారదర్శకత ఉండాలని, ఎవరి నుంచీ ఫిర్యాదులు అందరాదని ఆదేశించారు. వలంటీర్ల పాత్ర ఎక్కడా ఉండరాదని కలెక్టర్ ఆదేశించారు.

చంద్రబాబు సైకోలా ప్రవర్తిస్తున్నారు



మాట్లాడుతున్న పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- ధ్వజమెత్తిన పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: గత ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత చంద్రబాబు అధికార దాహంతో సైకోలా వ్యవహరిస్తున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. పాతపట్నంలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టుల పరిశీలన పేరుతో వంశధార ప్రాజెక్టును చంద్రబాబు గురువారం పరిశీలించారని, పర్యటనలో సీఎంపై పసలేని విమర్శలు చేశారని అన్నారు. అధికారం కోసం పుంగనూరులో పోలీసులపై దాడికి ప్రోత్సహించిన చంద్రబాబుతో రాష్ట్రానికి ప్రమాదం పొంచి ఉందని అన్నారు. పిల్లనిచ్చిన మామకు వెన్నుపోటు పొడిచి ముఖ్యమంత్రి అయిన చంద్రబాబుకు ప్రజల కష్టాల గురించి ఎలా తెలుస్తుందన్నారు. రాజకీయంగా ఎదిగేందుకు ఎవరినైనా మోసం చేయగల నైజం చంద్రబాబుదని ధ్వజమెత్తారు. 2014 నుంచి ఐదేళ్ల పాటు అధికారంలో ఉన్న చంద్రబాబు వంశధార నిర్వాసితులకు ఎందుకు 2013 చట్టం వర్తింపచేయలేకపోయారని ప్రశ్నించారు. వంశధార నిర్వాసితులను బలవంతంగా గ్రామాల నుంచి గెంటేసిన వారిలో చంద్రబాబు, కలమటకు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు, అప్పటి మంత్రి అచ్చెన్నాయుడు ఉన్నారని గుర్తు చేశారు. 2014 ఎన్నికల ముందు అధికారం కోసం ఎన్నో హామీలు ఇచ్చిన చంద్రబాబు వాటిని ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. పాతపట్నం ప్రజలు నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ నియోజకవర్గ ప్రజలకు వెన్నుపోటు పొడిచి పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. పదేళ్లుగా జిల్లా ఎంపీగా పనిచేస్తున్న కింజరాపు రామ్మోహన్నాయుడు జిల్లా అభివృద్ధి కోసం చేసిందేమిటో అందరికీ తెలుసున్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం నిరంతరం శ్రమించే జగన్‌మోహన్ రెడ్డిపై ఆరోపణలు చేసే ముందు మీరు చేసిందేమిటో ఆలోచించుకోవాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు రెడ్డి రామారావు, కొండాల అర్జునుడు, సవిరిగాన ప్రదీప్, ఎవి సురేష్, ఉదయ్‌కుమార్, పెనుమజ్జి విష్ణుమూర్తి, ముగడ జనార్ధన, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబూ.. మాయమాటలు కట్టిపెట్టు!

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం పాతబస్టాండ్: వ్యవసాయం అంటే దండగ అన్న చంద్రబాబు మళ్లీ ప్రజలను మభ్యపెట్టే వ్యూహంతో వచ్చారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఆయన శ్రీకాకుళంలోని అంబేడ్కర్ ఆడిటోరియం వద్ద శుక్రవారం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు శ్రీకాకుళం పర్యటనలో వాస్తవాలు కప్పి పుచ్చి మళ్లీ కల్లబొట్టి కబుర్లే చెప్పారని విమర్శించారు. ఎన్నికల ముందు జనాలను ఇలా వంచించడం బాబుకు అలవాటేనని తెలిపారు. ఐదేళ్ల అధికారంలో ఉండి వంశధారను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. వంశధార ప్రాజెక్టును ప్రారంభించింది, 60 శాతం పనులు జరిపించింది వైఎస్సారేనని తేల్చిచెప్పారు. ఆ ప్రాజెక్టును పూర్తి చేసేది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని స్పష్టం చేశారు. చంద్రబాబు హయాంలో ఆఫ్‌షోర్‌కు పైసా కూడా కేటాయించలేదని గుర్తు చేశారు. ఇప్పుడు రూ.840 కోట్లతో రివైజ్డ్ శాంక్షన్ చేసి టెండర్లను అధికారులు ఆహ్వానిస్తున్నారని తెలిపారు. వంశధార-నాగావళి పనులను అప్పుడు గాలికి వదిలేసి ఇప్పుడు ఫొటోలు దిగుతున్నారని ఎద్దేవా చేశారు. ఇరిగేషన్ ప్రాజెక్టులను టీడీపీ నాయకులు ఏటీఎంలా వాడుకున్నారని ప్రధాని మోదీనే అప్పట్లో విమర్శించారని గుర్తు చేశారు. పోలవరం వేగవంతం చేసేందుకు సీఎం కృషి చేస్తున్నారని, నిర్వాసితులకు పునరావాసం కల్పించి పులిచింతల, గండికోట, చిత్రావతి, సోమశిల, కండలేరు, గోరకు అవుకు రియర్వాయర్లలో గరిష్ట నీటి నిల్వలు సాధ్యం చేశారన్నారు. 2019 నుంచి ఏటా సగటున కోటి ఎకరాలకు సాగు నీటి సరఫరా జరుగుతోందని అన్నారు.

ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని మంజూరు చేసిన ఘనత కూడా వైఎస్సార్‌దేనని చెప్పారు. ఇప్పుడు భూసేకరణ జరుగుతోందని, డిజైన్ పూర్తయ్యాక మిగిలిన పనులు రెండు ప్యాకేజీలుగా చేసి జగన్ ప్రభుత్వం పనులు చేపట్టిందని తెలిపారు. చంద్రబాబు హయాంలో ఒక్క రూపాయి కూడా ఈ ప్రాజెక్టు కోసం ఖర్చు చేయలేదన్నారు. కాంగ్రెస్ హయాంలో తోటపల్లి పూర్తయితే ఆ పనిని కూడా చంద్రబాబు తన ఖాతాలోకి వేసుకుంటున్నారని అన్నారు. జీఓ 22, 63లను అడ్డం పెట్టుకుని చంద్రబాబు నిధులు దోచుకున్నారని ఆరోపించారు. కుప్పం బ్రాంచ్ కెనాల్లోనూ కమీషన్లు వసూలు చేశారని అన్నారు. శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్ నాయుడు జిల్లా ప్రజల సమస్యలను ఏనాడైనా పట్టించుకున్నారా అని ప్రశ్నించారు. తండ్రి పేరు చెప్పుకుని రాజకీయాల్లోకి వచ్చి సొంతంగా ఒక్క పనీ చేయలేని రామ్మోహననాయుడు సీఎం జగన్‌నే విమర్శించడం అతని అహంభావానికి నిదర్శనమన్నారు.

ప్రజలకు చంద్రబాబు క్షమాపణ చెప్పాలి



పేరాడ తిలక్

నందిగాం: అధికారంలో ఉన్న 14 ఏళ్లలో శ్రీకాకుళం జిల్లాకు చేసిందేమి లేకపోయినా ప్రాజెక్టుల పరిశీలన, సెల్ఫీ చాలెంజ్ అంటూ నాటకాలు ఆడుతున్న చంద్రబాబునాయుడు జిల్లా ప్రజలకు క్షమాపణ చెప్పాలని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారం, పదవీ కాంక్ష తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని గుర్తు చేశారు. వైఎస్సార్ హయాంలో వంశధార ఫేజ్-2కు రూ.1080 కోట్లు, నేరడి బ్యారేజికి రూ.197 కోట్లు, ఆఫ్‌షోర్‌కు రూ.127 కోట్లు, నదులపై బ్రిడ్జిల కోసం సుమారు రూ.150 కోట్లు కేటాయించారని వివరించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేరేడి బ్యారేజీ లిఫ్ట్‌కు రూ.350 కోట్లు, ఆఫ్‌షోర్‌కు రూ.850 కోట్లు, ఉద్దానం మంచినీటి కోసం రూ.730 కోట్లు కేటాయించారని గుర్తు చేశారు. ఇకనైనా జిల్లా పర్యటనలు చేసే ముందు ఆయా జిల్లాలకు మీరు చేసిందేమిటో చెప్పి పర్యటనలు చేయాలని హితవుపలికారు.

విద్య వ్యాపారమైపోయింది

- పీపుల్స్ స్టార్ నారాయణమూర్తి



టెక్కలి మండలం పాతనౌపడ సమీపంలో ప్రణవి విద్యా సంస్థలో పర్యటిస్తున్న పీపుల్స్ స్టార్ ఆర్.నారాయణమూర్తి

టెక్కలి: కొన్ని కార్పొరేట్ విద్యా సంస్థలన్నీ కలిసి విద్యను వ్యాపారంగా మార్చేశాయని పీపుల్స్ స్టార్ ఆర్.నారాయణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. టెక్కలిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రణవి విద్యా సంస్థల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తాను తెరకెక్కించిన 'యూనివర్సిటీ' చిత్రం అక్టోబర్‌లో విడుదలవుతున్న సందర్భంగా జిల్లాలో పలు విద్యా సంస్థల్లో పర్యటిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కొన్ని కార్పొరేట్ విద్యా సంస్థలు తమ విద్యా సంస్థల్లో చదువుతున్న వారికి అత్యధిక ర్యాంకులు సాధించడానికి పేపర్ లీకేజీలకు పాల్పడుతున్నాయని ఆయన ఆరోపించారు. ఇలాంటి సమస్యలను ఎత్తి చూపుతూ తాను యూనివర్సిటీ చిత్రాన్ని రూపొందించానని పేర్కొన్నారు. అభ్యుదయవాదులు, విద్యార్థులంతా తన సినిమాకు ప్రచారం చేయాలని ఆయన కోరారు. ఆయనతో పాటు టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, ప్రణవి విద్యా సంస్థల అధినేత డాక్టర్ పి.పరమేశ్వరరావు, ప్రతినిధులు పి.చంద్రశేఖర్ ఆజాద్, పి.సూర్యనారాయణ, డి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషకు వన్నె 'అవధానం'



సంపూర్ణ శతావధానంకు హాజరైన అతిథులు

శ్రీకాకుళం కల్చరల్: తెలుగు భాషకు వన్నె తెచ్చింది 'అవధాన' ప్రక్రియ అని, మరే ఇతర భాషల్లో ఈ ప్రక్రియ ఉండదని ఏలూరుకు చెందిన అవధాని వద్దిపర్తి పద్మాకర్ అన్నారు. స్థానిక బాపూజీ కళామందిర్‌లో సుమిత్ర కళాసమితి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే సంపూర్ణ శతావధానం కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి ఈ సంస్థ చేస్తున్న కృషి ప్రశంసనీయమని తెలిపారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా మాట్లాడుతూ తాను ఇలాంటి సభల్లో పాల్గొనడం ఇదే మొదటిసారని, ఇలాంటి మంచి సభకు ఆహ్వానించినందుకు ఆనందంగా ఉందని అన్నారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం ప్రారంభమైన అవధాన ప్రక్రియలో 25 సమస్యాపూరణలు, 25 దత్తపదులు, 25 వర్ణనాంశాలు, 25 ఆశువులతో ప్రారంభమైంది. ఈ శతావధాన ప్రక్రియకు సంచాలకులుగా హైదరాబాద్‌కు చెందిన కోటడ వెంకట లక్ష్మీనరసింహం, అప్రస్తుత ప్రసంగీకులుగా సురభి శంకరశర్మ, దండిభోట్ల దత్తాత్రేయశర్మలు వ్యవహరించారు. సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలో భాగంగా కూచిపూడి నృత్యాల ప్రదర్శన జరిగింది.

నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష (ఎన్ఎంఎంఎస్)కు అర్హులైన విద్యార్థులు వచ్చేనెల 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరావు తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ అవకాశం ఉందన్నారు. జిల్లాలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల్లో చదువుతున్న వారు అర్హులని చెప్పారు. ఈ ఏడాది ఎనిమిదో తరగతి చదువుతూ.. కుటుంబ వార్షికాదాయం రూ.3,50,000లోపు ఉన్న విద్యార్థులు అర్హులని అధికారులు పేర్కొన్నారు. జనరల్, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 పరీక్ష రుసుంగా చెల్లించి వచ్చేనెల సెప్టెంబర్ 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకుని, ప్రింటెడ్ నామినల్ రోల్స్, ధ్రువపత్రాలను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అందించాలని సూచించారు. ఎన్ఎంఎంఎస్ పరీక్ష ఈ ఏడాది డిసెంబర్ 3వ తేదీన జరుగుతుందని డీఈఓ వెంకటేశ్వరరావు చెప్పారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీఓవి.ఇన్‌వెబ్‌పోర్టల్ చూడాలన్నారు..

గురుకులం నుంచి ఇద్దరు విద్యార్థులు పరారు

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం సమీపంలోని పెదపాడు సాంఘిక సంక్షేమ శాఖ అంబేడ్కర్ గురుకులంలో శుక్రవారం వేకువజామున ఇద్దరు విద్యార్థులు స్కూలు గేటు దూకి పరారయ్యేందుకు ప్రయత్నించారు. ఉదయం 4.30 సమయంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు విద్యార్థులు బయటకు వచ్చారు. వీరిలో ఐదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు సిబ్బంది కళ్లుగప్పి పరారయ్యారు. ఇందులో ఒక విద్యార్థిది ఆడవరం కాగా, మరో విద్యార్థినిది శ్రీకూర్మం వద్ద సింతువలస గ్రామం. వీరు స్కూల్ నుంచి వెళ్లిపోతుండగా దారిలో ఓ వ్యక్తి చూసి గుర్తుపట్టి వారి తల్లిదండ్రులకు విషయం చెప్పారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు స్కూల్ వద్దకు వచ్చి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలు క్షేమంగా ఉన్నారు.

అగ్ని ప్రమాదంలో మూడిళ్లు దగ్ధం

కంచిలి: మండలంలోని దొలాయిసాయి గ్రామంలో శుక్రవారం సాయంత్రం సంభవించిన అగ్ని ప్రమాదంలో రుషిబుయ్య, జనంత సవర, రఘునాథ్ మండలకు చెందిన మూడు పూరిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఇంటిలోని గ్యాస్ స్టవ్స్, సిలిండర్లు, టీవీఎస్ మోపెడ్, సైకిల్, దుస్తులు, నగదు, ఇతర సామాన్లు కాలిపోయాయి. మొత్తం రూ.3 లక్షల వరకు ఆస్తినష్టం సంభవించినట్లు తెలుస్తోంది. సమాచారం తెలిసిన వెంటనే స్థానిక వీఆర్వో కృష్ణారావు కాలిపోయిన ఇళ్లను పరిశీలించి, నష్టపోయిన వివరాలను నమోదు చేసుకున్నారు.

జాబ్‌మేళాకు 1600 మంది హాజరు

నరసన్నపేట: నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. స్థానిక ఎల్‌వీఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. టీమ్ హెచ్ ఆర్ అండ్‌కో, సిక్కోలు సేవా సమితి సహకారంతో ఏర్పాటు చేసిన ఈ జాబ్ మేళాలో 32 కంపెనీలకు చెందిన హెచ్‌ఆర్‌లు హాజరుకాగా 720 మందిని ఎంపిక చేశారు. మొత్తం 1600 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో పొందర కూరాకుల కార్పొరేషన్ చైర్మన్ రాజాపు హైమావతి, ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతు రామారావు, వైఎస్సార్ సీపీ నాయకులు గుప్త, కళాశాల డైరెక్టర్ స్వరూప్, ప్రిన్సిపాల్ ఎం. ప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ జీవీ జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380-00
బంగారం(22సి. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు

భీమడోలు: జాతీయ రహదారి పూళ్ల వద్ద ఆగి ఉన్న లారీని ఓ కారు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఏలూరు ఆశ్రం ఆస్పత్రికి తరలించారు. శ్రీకాకుళానికి చెందిన ఎం.సాహిత్యకు ఈ ఏడాది పబ్లిక్ పరీక్షల్లో 585 మార్కులు రావడంతో నూజివీడులోని ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. ఆమెను శుక్రవారం చేర్పించాల్సి ఉండడంతో గురువారం రాత్రి కారులో సాహిత్య తండ్రి నాగభూషణరావు, మేనమామ రమణలు బయల్దేరారు. కారు డ్రైవర్ సంతోష్ అతివేగంగా నడుపుతూ నిద్రమత్తులో పూళ్ల రహదారిపై అప్పటికే ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో కారు లారీకి కిందకు దూసుకెళ్లింది. సమాచారం అందుకున్న భీమడోలు, ఉంగుటూరు 108 అంబులెన్స్ సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. తాళ్లు కట్టి కారును లాగి కారులో ఇరుక్కున్న డ్రైవర్ సంతోష్‌తో పాటు మరో ముగ్గురిని ప్రాణాలతో కాపాడారు. ప్రమాదంలో కారు డ్రైవర్ సంతోష్, విద్యార్థి తండ్రి నాగభూషణరావుకు తీవ్ర గాయాలయ్యాయి. మేనమామ రమణ, సాహిత్యలకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని అంబులెన్స్‌లో ఏలూరులోని ఆశ్రం ఆస్పత్రికి తరలించారు. ఆ చిన్నారిని మేనమామ నూజివీడు ట్రిపుల్ ఐటీ కళాశాలకు తీసుకుని వెళ్లారు. భీమడోలు పోలీసులు కేసు విచారిస్తున్నారు.